# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

బుధవారం | 20 మే, 2026 | పేజీలు :06


## జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలి



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** జిల్లా అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కె. హరిత ఆదేశించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్ తో కలిసి ప్రభుత్వ శాఖల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై మంగళవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12న విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో అన్ని పాఠశాలలు, ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్, మూత్రశాలలు వంటి మౌలిక వసతులు పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభం రోజే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని తెలిపారు. వర్షాలు ప్రారంభం అయ్యేలోపు ఇంజనీరింగ్ శాఖల పరిధిలోని భవనాలు, వంతెనల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. యాసంగి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అధికారులు ప్రతిరోజు సందర్శించి పర్యవేక్షించాలని, శాఖల వారీగా అభివృద్ధి పనుల నివేదికలను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల:** నైపుణ్యాభివృద్ధితో ఎన్నో అవకాశాలు వస్తాయని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాల సందర్భంగా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో మంగళవారం నైపుణ్యాభివృద్ధిపై అవగాహన సదస్సు నిర్వహించగా, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శిక్షణ సంస్థలు ఐటీఐ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్, ఇతర సంస్థల ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి.. ఏ ఏ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు? అర్హత ఇతర అంశాలపై జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి మార్చి 6వ తేదీన ప్రజా పాలన –ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఇందులో భాగంగా జూన్ 12వ తేదీ వరకు 10 శాఖల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్న యువజన క్రీడా వారోత్సవాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. దేశ, రాష్ట్ర అభివృద్ధిలో నేటి యువత, విద్యార్థులు చాలా కీలకమని స్పష్టం చేశారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇటీవల విద్యా శాఖ వారోత్సవాల కింద సమ్మర్ క్యాంపులు నిర్వహించామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఎన్నో అంశాల్లో ప్రతిభ చూపారని గుర్తు చేశారు. విద్యతోపాటు ఆటలు ఆడాలని, దీంతో శారీరక, మానసిక సమతుల్యత ఉంటుందని, క్రమశిక్షణ అలవడుతుందని వివరించారు. ఉన్నత చదువుతో పాటు టెక్నికల్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్ నేర్చుకోవాలని సూచించారు. ఇప్పటి పరిశ్రమలకు ఎలాంటి స్కిల్స్ అవసరమో తెలుసుకొని ఆ దిశలో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ఐటీఐ, అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్, ఆర్ సేటీ, జీఎంఆర్, ఐడీటీఆర్, టాస్క్ తదితర సంస్థల్లో అందిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులను సద్విని యోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. పూర్తి వివరాలకు ఆయా సంస్థల్లో సంప్రదించాలని సూచించారు. అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ లో శిక్షణ పొందిన వారికి పలు సంస్థలు ఉపాధి కల్పిస్తాయని తెలిపారు. పరిశ్రమల శాఖ, ఇతర ప్రభుత్వ శాఖల ఆద్వర్యంలో అందిస్తున్న స్వయం ఉపాధి స్కీములు, సబ్సిడీ సద్వినియోగం చేసుకొని.. స్వయం యువత ఉపాధి పొందాలని ఆకాంక్షించారు. జిల్లాలోని వివిధ శిక్షణ సంస్థలు ఏడాది అంతా యువతకు శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించి ముందుకు వెళ్లాలని సూచించారు. నర్సింగ్ పూర్తి చేసి.. విదేశాల భాష, నైపుణ్యాల్లో పట్టు ఉన్న వారికి టామ్ కామ్ ఆద్వర్యంలో వివిధ దేశాల్లో ఉపాధి కల్పన అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. జిల్లా నుంచి ఇప్పటిదాకా 45 మందికి విదేశాల్లో కొలువులు వచ్చాయని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పిలుపు నిచ్చారు. యువత ఉపాధిని పొంది తమ తల్లితండ్రుల సంరక్షణ బాధ్యతను చూసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ లక్ష్మీ నారాయణ, సీపీఓ శ్రీనివాసాచారి, జీఎం ఇండస్ట్రీస్ హనుమంతు, డీవైఎస్ఓ రాందాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఎల్డీఎం మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు.



## నిబంధనలు పాటించని లాడ్జ్ సీజ్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ప్రజల భద్రత,శాంతి భద్రతల పరిరక్షణకై లాడ్జీలు, గెస్ట్ హౌస్ లపై జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డిఎస్పీ కె.పురుషోత్తం సూచనలతో ధర్మపురిలోని వసతిగృహంపై మంగళవారం పోలీసు, మున్సిపల్ అధికారులు కొరడా జులిపించారు. పట్టణంలోని విజయలక్ష్మి లాడ్జికి ట్రేడ్ లైసెన్స్ లేకుండా గెస్ట్ హౌస్ నిర్వహించడం, అతిథుల ఆధార్ కార్డులతోపాటు పూర్తి వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడం అలాగే సీసీ టీవీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడం వంటి అనేక నిబంధనలను ఉల్లంఘించడంతో సదరు లాడ్జిపై చర్యలు తీసుకోవాలని సీఐ రాం నర్సింహారెడ్డి మున్సిపల్ కమిషనర్ కు రిక్వీజేషన్ ఇచ్చారు. దీంతో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు సిబ్బంది విజయలక్ష్మి గెస్ట్ హౌస్‌ను సీజ్ చేసారు. అదేవిధంగా కమర్షియల్ భవనంలో డొమెస్టిక్ విద్యుత్ మీటర్ల వాడకంపై తగిన చర్యలు చేపట్టాలని సీఐ రాం నర్సింహా రెడ్డి ఇచ్చిన రిక్విజేషన్ పై ట్రాన్స్కో అధికారులు చర్యలు తీసుకోనున్నారు. ఈ సందర్భంగా ఎస్సై జి.మహేష్ మాట్లాడుతూ.. ధర్మపురి పరిధిలోని అన్ని లాడ్జీలు, గెస్ట్ హౌస్ లు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ కల్గివుండాలని, వచ్చిన వారి పూర్తి వివరాలు నమోదు చేయాలని సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు వుండాలని పేర్కొన్నారు. లాడ్జీలలో సరైన రికార్డులు నమోదు చేయకపోవడం, గుర్తింపు కార్డులు,ఫోన్ నంబర్లు లేకుండా వసతి కల్పించినట్లైతే నేరగాళ్ళు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అవకాశం ఉంటుందని నిబంధనలు తప్పనిసరిగా పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరా రు.

## హోటళ్లు, లాడ్జీల యాజమాన్యాలు అలర్ట్‌గా ఉండాలి

### పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం

**ప్రజాపక్షం/ కరీంనగర్:** కరీంనగర్ నగరంలో ఇటీవల పీఎంజే జ్యువెలరీలో జరిగిన భారీ దోపిడీ ఉదంతం నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోటళ్లు, లాడ్జీల యజమానులు, నిర్వాహకులతో కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలులో పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆయుధాలతో కూడిన ఓ అంతరాష్ట్ర దొంగల ముఠా నకిలీ ఆధార్ కార్డులు, తప్పుడు ఫోన్ నంబర్లు, తప్పుడు చిరునామాలు ఇచ్చి నగరంలోని పలు హోటళ్లలో దాదాపు రెండు నెలల పాటు బస చేసి, నిఘా (రెక్కి) నిర్వహించినట్లు పోలీసుల విచారణలో తేలిందన్నారు. ఈ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రతే ధ్యేయంగా పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా కఠినమైన మార్గదర్శకాలను జారీ చేస్తున్నామని తెలిపారు. హోటళ్లు, లాడ్జీలలో రూములు కేటాయించే ముందు ప్రభుత్వ గుర్తింపు కార్డులను క్షుణ్ణంగా పరిశీలించాని, కేవలం ఆధార్ కార్డులను గుడ్డిగా నమ్మకుండా.. అందులోని ఫోటో, వయస్సు, చిరునామా అసలైనవా కాదా అని సరిచూసుకోవాలని, అవసరమైతే అదనపు గుర్తింపు కార్డులను అడగాలన్నారు.కస్టమర్లు ఇచ్చే మొబైల్ నంబర్ పనిచేస్తుందో లేదో క్రాస్–చెక్ చేసుకోవాలని, అది సదరు వ్యక్తి పేరు మీద ఉందో లేదో నిర్ధారించుకోలన్నారు. విదేశీయులు వస్తే నిబంధనల ప్రకారం తక్షణమే సమాచారం అందించాలని పేర్కొన్నారు. ప్రతి హోటల్‌లో హై–రెజల్యూషన్ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకొని. కనీసం 90 రోజుల ఫుటేజీని భద్రపరచాలని, గెస్ట్ రిజిస్టర్, ఐడీ ప్రూఫ్స్, వాహనాల వివరాలు, చెక్–ఇన్/చెక్–అవుట్ సమయాలను డిజిటల్ రూపంలో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. లగేజీ లేకుండా రూమ్ తీసుకునేవారు, ఆయుధాలు లేదా అనుమానాస్పద బ్యాగులతో వచ్చేవారు, సీసీ కెమెరాల ముందుకు రాకుండా తప్పించుకునే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, భారీ నగదు లావాదేవీలు చేసే వారి వివరాలను వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు చేరవేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించి, నిందితులకు ఆశ్రయం కల్పించినా, పోలీసుల తనిఖీలకు సహకరించకపోయినా సదరు హోటల్ యాజమాన్యాలపై క్రిమినల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

**నగరంలో ముమ్మరంగా తనిఖీలు**

అంతర్రాష్ట్ర నేరగాళ్ల కదలికలను అణచివేయడానికి కరీంనగర్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విస్తృత నిఘా మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతున్నా, హఠాత్తుగా ఇళ్లు అద్దెకు తీసుకుని వింతగా ప్రవర్తిస్తున్నా, అనాథగా వాహనాలు వదిలేసి వెళ్లినా వెంటనే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఏసీపీ వెంకటస్వామి, ఇన్స్పెక్టర్లు రాంచందర్ రావు, సృజన్ రెడ్డి, తిరుమల్, స్థానిక హోటల్స్ మరియు లాడ్జి ల యజమానులు పాల్గొన్నారు.



# పర్యావరణంపై ప్రజల్లో చైతన్యం రావాలి




**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పర్యావరణం పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం రావాలనిజాతీయ హరిత దళం జిల్లా కో ఆర్డినేటర్ గూళ్ళ అంజన్ కుమార్ తెలిపారు. 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా లక్ష్యంతో కూడిన వేసవి శిబిరం పెద్దపెల్లి మండలం అప్పన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.తెలంగాణ ప్రభుత్వ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో తెలంగాణ జాతీయ హరిత దళం సహకారంతో 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా లక్ష్యంతో కూడిన వేసవి శిబిరం ఘనంగా నిర్వహించారు. రక్షించడంసంరక్షించడం ప్రోత్సహించడం అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా విద్యార్థులతో స్థానిక పర్యావరణ సమస్యలపై చర్చలు నిర్వహించారు.

ఉపరితల,భూగర్భ జలాల కొరత, జల వనరుల కాలుష్యం, గాలి కాలుష్యం, వ్యర్థాల నిర్వహణ సమస్యలు, ప్లాస్టిక్ కాలుష్యం, పరిశుభ్రత లోపం, పచ్చదనం తగ్గిపోవడం వంటి అంశాలపై అంజన్ కుమార్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పిఎం. షేక్, వేసవి శిబిరం పీఎం, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, జీవశాస్త్ర ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేందర్, వంగ అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## లేఅవుట్ ప్లాట్ల క్రమబద్ధీకరణ ఫీజు చెల్లింపులపై భారీ రాయితీ

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** రాష్ట్రంలోని ప్లాట్ల యజమానులకు తెలంగాణ ప్రభుత్వం గ్రామ బద్ధీకరణ ఫీజు చెల్లింపులో భారీ రాయితీ అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ రమేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.పెండింగ్లో ఉన్న లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం ఫీజుల చెల్లింపు పై ఏకంగా 25 శాతం భారీ రాయితీని ప్రకటిస్తూ ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందని అన్నారు.ఎల్ఆర్ఎస్ 2020 కింద దరఖాస్తు చేసుకున్న అర్హులైన ప్లాట్ యజమానులకు ఈ వెసులుబాటు ప్రభుత్వం కల్పించడం జరిగిందన్నారు. 2026 మే 1 నుండి జూలై 31 వరకు మూడు నెలల కాలంలో ఫీజు చెల్లించే వారికి మాత్రమే ఈ రాయితీ వర్తిస్తుంది కావున ఈ అరుదైన అవకాశాన్ని ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకొని తమ ఆస్తులను క్రమబద్ధీకరించుకోవాలని కోరారు.ప్రభుత్వం తాజా నిర్ణయంతో ప్లాట్ల యజమానులకు భారీగా ఆర్థిక ప్రయోజనం చేకూరుతుంది కాబట్టి ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు అని ప్లాట్ లో యజమానులకు కమిషనర్ రమేష్ సూచించారు.

## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డిఆర్డిఒ రఘువరన్



**ప్రజాపక్షం/పెగడపల్లి:** మండల పరిధిలోని మద్దులపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకెపి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జగిత్యాల జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. రఘువరన్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న ధాన్యం సేకరణ ప్రక్రియను ఆయన నిశితంగా పరిశీలించారు.అనంతరం కేంద్రం మేనేజింగ్ కమిటీ సభ్యులు మరియు స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలను, కొనుగోళ్ల పురోగతిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డిఆర్డిఓ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి, ఎక్కడా ఎలాంటి అవకతవకలకు తావియ్యకుండా పారదర్శకంగా ధాన్యం కొనుగోళ్లు జరపాలని సెంటర్ ఇంచార్జ్, కమిటీ సభ్యులను ఆదేశించారు.కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని వెంటనే తూకం వేసి, ఆలస్యం చేయకుండా రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో సెర్ప్ ఏపిఎం ఏ. రవి వర్మ, సిసి సెంటర్ ఇంచార్జ్ జి. తిరుపతి ,కమిటీ సభ్యులు,రైతులు పాల్గొన్నారు.

## అంకిత భావంతో పని చేయాలి



**ప్రజాపక్షం/రామగిరి :** రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. సింగరేణి వ్యాప్తంగా నిర్వహిస్తునటువంటి మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలలో భాగంగా ఆర్జీ3 ఏరియాలోని ఓ.సి.ఎం1 ఉపరితలగని సైట్ ఆఫీస్ నందు మంగళవారం నిర్వహించిన కార్యక్రమాన్ని రామగుండం3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంస్థ నిర్దేశించుకున్న ఉత్పత్తి లక్ష్యాలను అధిగమించడానికి, యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, భద్రతతో కూడిన ఉత్పత్తిని సాధించడానికి కృషి చేయాలని అన్నారు.ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన బాధ్యత అందరి పైన ఉందని,కావున ఎవరి స్థాయిలో వారు సాధ్యమైనంత వరకు వ్యయాన్ని తగ్గించుకోవాలని కోరారు.అంతే కాకుండా నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటిస్తూ, అంకిత భావంతో పని చేయాలని, ప్రస్తుతం నెలకొన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా, పెరుగుతున్న ఖర్చులను ప్రతి ఉద్యోగి దృష్టిలో ఉంచుకొని డీజిల్ పై ఖర్చును తగ్గిస్తూ యంత్రాలను వినియోగించాలని, యంత్రాలకు ఆయిల్ లీకేజీలు కాకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు వై.వి.రావు, గడ్డం తిరుపతి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఏరియా ఇంజనీర్ వి.వి.సుధాకర్ రెడ్డి, ఎస్వోటు జియంలు బి.వి.సత్య నారాయణ, మేనేజర్ ఆర్.పాపయ్య, పిట్ సెక్రెటరీలు, ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు,ఉద్యోగులు,తదితరులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ వర్చువల్ మీటింగ్ విజయవంతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్లో భాగంగా జిల్లా యువజన, క్రీడా శాఖ ఆధ్వర్యంలో పెద్దపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ వర్చువల్ మీటింగ్ కార్యక్రమం విజయవంతంగా పూర్తయినట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి ఎ. సురేష్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వర్చువల్ మీటింగ్ కార్యక్రమానికి కళాశాల నుండి 255 మందికి పైగా విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారని, ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రస్తుత పోటీ ప్రపంచంలో అవసరమైన వివిధ స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు, స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్కిల్ యూనివర్సిటీ కోర్సుల గురించి పూర్తి అవగాహన కల్పించారు. వీటితో పాటు దేశ సేవలో భాగస్వామ్యం అయ్యేందుకు వీలుగా అగ్నివీర్ నియామకాలు,ఆర్మ్డ్ ఫోర్సెస్, పారా మిలిటరీ ఫోర్సెస్లో ఉన్న విభిన్న కెరీర్ అవకాశాలు, ఉద్యోగాల గురించి విద్యార్థులకు సవివరంగా వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్, వైస్ ప్రిన్సిపాల్,ట్రైనింగ్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ట్రైనింగ్ ఆఫీసర్లు,తదితరులు పాల్గొన్నారు.

## ఎంపి అరవింద్పై కఠిన చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/కరీంనగర్:** నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలంగాణ మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ఖండించారు.ఈ మేరకు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి మంగళవారం పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ విమర్శలు ప్రజా అంశాలపై ఉండాలని, దేశ అత్యున్నత పదవులు, రాజ్యాంగ హోదాల్లో ఉన్న నాయకులపై ఆధారాలు లేని వ్యాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఎంపీ అరవింద్పై బిజెపి అధిష్టానం వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని, సస్పెన్షన్ వేటు వేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. బరాబర్ 2034 వరకు సీఎం రేవంత్ రెడ్డి ఉంటారు రాసిపెట్టుకో. నీకు దమ్ముంటే చేతనైంది చేసుకో అని ఎంపీ అరవింద్కు సవాల్ విసిరారు. లేకపోతే చేతులు ముడుచుకొని కూర్చోవాలని హితవు పలికారు. రేవంత్ రెడ్డి మరో సువేందు అవుతారేమోనని అనుమానం వ్యక్తం చేస్తూ ఆయనకు మోదీతో లింకు ఉందని ఆరోపించడం తగదన్నారు. ప్రధానమంత్రి పేరును అనవసరంగా రాజకీయ వివాదాల్లోకి లాగడం బాధ్యతాయుత రాజకీయాలకు సరికాదని అన్నారు. అలాంటి వ్యాఖ్యలను బిజెపి అధిష్టానం సీరియస్గా తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన వ్యాఖ్యలను ఎంపీ అరవింద్ బేషరతుగా ఉపసంహరించుకోవాలని బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి డిమాండ్ చేశారు. రాజకీయాల్లో హుందాతనం పాటించడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని స్పష్టం చేశారు. బిజెపి అధిష్టానం వెంటనే స్పందించి అరవింద్పై చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ శ్రేణులు తీవ్రస్థాయిలో స్పందిస్తాయని హెచ్చరించారు.

## స్వేరోస్ నెట్వర్క్ నూతన గ్రామ కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/శంకరపట్నం:** మండల పరిధిలోని కాచాపూర్ గ్రామంలో స్వేరోస్ నెట్వర్క్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాతంగి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామ కమిటి ఎన్నుకోవడం జరిగింది.గ్రామ శాఖ అధ్యక్షునిగా మాతంగి రోహిత్,ప్రధాన కార్యదర్శిగా నెలవేణి శంకర్,ఉపాధ్యక్షులుగా మాతంగి అజేయ్,నెలవేణి వంశీ,కోశాధికారిగా మాతంగి చరణ్ తేజ్,ఆర్గనైజ్ సెక్రటరీలుగా మొరే రాజుకుమార్,మారముల్ల యస్వంత్,సంయుక్త కార్యదర్శులుగా మారముల్ల తరున్,ప్రసాద్లను ఎనుకున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లడుతూ స్వేరోస్ నెట్వర్క్ యొక్క ఐడియాలజీని గడపగడపకు తీసుకెళ్తామని,అభివృద్ధి చెందె దిశగా పాటుపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గోన్నారు.

## తాగునీటి పైప్లైన్ లీకేజీని పట్టించుకోని అధికారులు

**ప్రజాపక్షం/ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని పాత పంచాయతీ కార్యాలయం పక్కన ఉన్న ప్రధాన తాగునీటి పైప్లైన్ కొన్ని రోజులుగా లీకవుతోంది. దీనివల్ల నీరు వృథా కావడంతో పాటు కలుషితమై సరఫరా అవుతోంది. ఈ నీటిని తాగడం వల్ల అంటువ్యాధులు ప్రబలుతాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి లీకేజీని అరికట్టి, స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** వేసవి కాలంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దపల్లి పోలీసులు తెలిపారు. రాత్రి వేళల్లో ఆరుబయట గాని, డాబాలపై గాని కాకుండా, సురక్షితంగా ఇంట్లోనే నిద్రించాలని, సెలవుల నిమిత్తం ఊరికి వెళ్లేవారు, ఇళ్లకు తాళాలు వేసి వెళ్లేటప్పుడు,తమ వద్ద ఉన్న విలువైన ఆభరణాలను మరియు నగదును తమతో పాటు తీసుకెళ్లాలని లేదా బ్యాంకు లాకర్లలో భద్రపరచుకోవాలని,ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనిస్తే, వెంటనే పెద్దపల్లి టౌన్ పోలీస్ స్టేషన్కు లేదా డయల్ 100 కు కాల్ చేసి సమాచారం అందించాలని తెలిపారు.

## సుందరయ్య స్ఫూర్తితో వర్గ పోరాటాలను ఉధృతం చేయాలి

**ప్రజాపక్షం/సుల్తానాబాద్ :** పుచ్చలపల్లి సుందరయ్య 41 వ వర్ధంతి సందర్భంగా మంగళవారం సుల్తానాబాద్ రైస్ మిల్ ఆపరేటర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో స్థానిక పూసాల పెద్దమ్మ గుడి వద్ద సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.అనంతరం జరిగిన వర్ధంతి సభలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు,దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాట యోధుడు,ప్రముఖ పార్లమెంటేరియన్ పుచ్చలపల్లి సుందరయ్య నీ స్మరించుకోవడం అంటే నేడు భారత దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థను అర్థం చేసుకొని కార్మిక వర్గ పోరాటాలను ఉదృతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పుడే కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య భూస్వామ్య అగ్ర కులంలో పుట్టిన తన ప్రజా జీవితంలో వాటన్నింటినీ విసర్జించి బాల్య దశ నుండే కుల వివక్షకు,సామాజిక అణిచివేతకు వ్యతిరేకంగా తన ఊరు,తన కుటుంబం నుండి పోరాటాన్ని ప్రారంభించారనిఅన్నారు.స్వాతంత్ర ఉద్యమంలో గాంధీ, నెహ్రూ లాంటి నాయకులతో కలిసి పాల్గొన్నారని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన వీర తెలంగాణ విప్లవ రైతాంగ సాయుధ పోరాటానికి నాయకత్వం వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ సిఐటియు మండల కో కన్వీనర్ మాతంగి రాజమల్లు , రైస్ ఆపరేటర్ ల సంగమ అధ్యక్షుడు తాండ్ర అంజయ్య, రైస్ మిల్ ఆపరేటర్ల సంఘం కార్యదర్శి నౌవుడ్ల బ్రహ్మచారి, అనంతుల శ్రీనివాస్, సదయ్య, లింగయ్య, రమేష్, ప్రసాద్, మహేష్, సుధాకర్ రావు, కుమార్, సతీష్, శ్రీనివాస్, రాజేశం, ప్రభాకర్, ఓదెలు, కొమురయ్య, మల్లేష్, తిరుపతి, మహేందర్, సంపత్, సురేష్, తఆపరేటర్స్ పాల్గొన్నారు .

# కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు లేవు

## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగనబట్ల దినేష్



**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి మండలంతో పాటు ధర్మపురి నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ వరి ధాన్య కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి ఇబ్బందులు లేవని రైతులు ఈసారి అత్యధికంగా దిగుబడి సాధించడంతో కొనుగోలులో కొంత జాప్యం జరుగుతున్నాయని జగిత్యాల జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ సంగనభట్ల దినేష్ తెలిపారు.మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుముల లక్ష్మణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సంగ నర్సింహులు తో కలిసి పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు.గత ప్రభుత్వంలో రైతులను అనేక ఇబ్బందులకు గురిచేసి రైతులకు సంకెళ్ల వేసిన ప్రభుత్వం బిఆర్ఎస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. నేడు రైతుల పక్షపాతిగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన చేస్తుందని రైతులకు ఎక్కడ ఇబ్బందులు లేవని పేర్కొన్నారు.నాడు కమిషన్లు తీసుకొని ప్రజలను ఇబ్బంది పెట్టినవారు నేడు కమిషన్ల గురించి మాట్లాడం సిగ్గుచేటని కమిషన్ లు తీసుకున్నది మీరు కదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ నాయకులు స్థాయి మించి విమర్శ చేస్తే సహించమన్నారు.ముఖ్యమంత్రిని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను స్థాయి మరచి విమర్శలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.నాయకులు అగౌరవంగా మాట్లాడుతూ ఏకవచనంతో సంబోధిస్తున్నారని గౌరవంగా మాట్లాడడం నేర్చుకోవాలి అన్నారు.గత సంవత్సరం కంటే ఈ సీజన్లో రైతులకు వరి ధాన్యం ఎక్కువగా పండిందని దానితో కొంత ఇబ్బందులు అవుతున్నాయని తెలిపారు మార్కెట్ యార్డులో మక్కలు మరియు వరి ధాన్యం కొలుగోలు ఏక కాలంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. మీ ప్రభుత్వంలో మార్కెట్ యార్డులో కనీస సౌకర్యాలు లేకుండానే నేడు రైతుల కోసం ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. గతంలో తప్పు తాలు పేరుతో రైతులను అనేక ఇబ్బందులకు గురిచేసారని నేడు రైతుల ఆమోదంతో వరి ధాన్యం 42 కేజీలు కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. మరోసారి స్థాయి మరిచి విమర్శిస్తే సహించమని హెచ్చరించారు.మండల పార్టీ ఉపాధ్యక్షుడు వేముల రాజేష్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చిపిరిశెట్టి రాజేష్ కౌన్సిలర్లు ఓజ్జల లక్ష్మణ్, సర్పంచ్ రాందేని మొగిలి నాయకులు,ఆశెట్టి శ్రీనివాస్,అప్పం తిరుపతి,ఎన్నం మధుకర్ రెడ్డి, రఫీయొద్దీన్,స్తంభంకాడి గణేష్,తదితరులు పాల్గొన్నారు.

# మే 20న కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి



**ప్రజాపక్షం/ముత్తారం :** ఈ నెల 20న నిర్వహించనున్న దేశవ్యాప్త కెమిస్ట్స్, డ్రగ్గిస్ట్స్ సమ్మెను విజయవంతం చేయాలని ముత్తారం మండల అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం శ్రీధర్, ప్రధానకార్యదర్శి కాసు తిరుపతి పిలుపునిచ్చారు. మంగళవారం నాడు వారు సమ్మెకు సంబంధించిన కరపత్రాన్ని స్థానిక తహసిల్దార్ మధుసూదన్ రెడ్డి,ఎస్సై రవికుమార్కు అందజేశారు.కార్పొరేట్ సంస్థల భారీ డిస్కౌంట్లను అరికట్టడం, కొవిడ్ నాటి జీఎస్ఆర్ 220 ఈనోటిఫికేషన్ను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలనే ప్రధాన డిమాండ్లతో ఈ సమ్మెను చేపడుతున్నట్లు వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు కె.వి.చారి,ముస్కె సదానందం,వేముల హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# వెల్లుల్ల శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో రూ.88,342 ఆదాయం

**ప్రజాపక్షం /మెట్పల్లి :** మెట్పల్లి మండలంలోని వెల్లుల్ల గ్రామంలో ఉన్న శ్రీ ఎల్లమ్మ దేవాలయంలో మంగళవారం నిర్వహించిన వివిధ సేవలు, హుండీ లెక్కింపుల ద్వారా మొత్తం రూ.88,342 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు తెలిపారు.దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ సేవా టికెట్ల ద్వారా రూ.77,701 ఆదాయం లభించగా, అమ్మవారి దేవాలయంలో ఏర్పాటు చేసిన హుండీలు లెక్కించగా రూ. 10,641 వచ్చినట్లు వెల్లడించారు. దీంతో మొత్తం ఆదాయం రూ.88,342గా నమోదైంది.ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ జగిత్యాల డివిజన్ పరిశీలకులు ఎం రాజా మొగిలి, డిప్యూటేషన్ సిబ్బంది కల్వకుంట్ల అనిల్ రావు, కూకట్ల రాజేందర్, గుంటుక శివ కేశవ్, హాజరై ప్రత్యేక పూజ లు నిర్వహించా రు.భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాలయ నిర్వహణ దేవాలయ కార్యనిర్వహణ అధికారి కే. కాంత రెడ్డి తెలిపారు.

# టీజీఆర్జేసీ ఎంట్రన్స్లో నామాపూర్ విద్యార్థిని ప్రతిభ

**ప్రజాపక్షం /పెగడపల్లి :** ఇంటర్మీడియట్ ప్రవేశాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన టీజీఆర్జేసీ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో మండలంలోని నామాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థిని పోలోజి శ్రీ లక్ష్మి అద్భుత ప్రతిభ కనబరిచినట్లు మండల విద్యాధికారి సులోచన తెలిపారు.ఎంపికైన ఫలితాల వివరాల ప్రకారం ఎంపీసీ విభాగంలో పరీక్ష రాసిన శ్రీ లక్ష్మి 82 మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో 680వ ర్యాంక్ కైవసం చేసుకుంది. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని రాష్ట్ర స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంక్ సాధించడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంక్ సాధించి గ్రామానికి, మండలానికి పేరు తెచ్చిన విద్యార్థిని పోలోజి శ్రీ లక్ష్మిని మండల విద్యాధికారి సులోచన, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు మరియు గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో శ్రీ లక్ష్మి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

# మద్యం మత్తులో ద్విచక్ర వాహనం నడిపి

## ఇద్దరి మృతికి కారణమైన వ్యక్తికి రిమాండ్

**ప్రజాపక్షం/గొల్లపల్లి :** మద్యం మత్తులో నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనం నడిపి ఇద్దరి వ్యక్తుల మృతికి కారకుడైన వ్యక్తిని అదుపులోకి తీసుకొని రిమాండ్ చేసినట్లు ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపారు .ఎస్సై కృష్ణ సాగర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని గుంజపడుగు గ్రామానికి చెందిన పురాణం లక్ష్మక్క (63)మోతే పోచవ్వ (65)బిక్షాటన నిమిత్తం 2026 మార్చి 29న ఉదయం 4 గంటలకు గ్రామం నుండి జగిత్యాలకు వెళుతుండగా గ్రామ శివారు వరకు వెళ్లే సరికి వీరికి ఎదురుగా రంగదాముని పల్లి గ్రామానికి చెందిన నర్ర పవన్ (28) తన ద్విచక్ర వాహనాన్ని మద్యం మత్తులో అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి పురాణం లక్ష్మక్క ,మోతే పోచవ్వ లను ఢీకొనడంతో పురాణం లక్ష్మక్క చికిత్స పొందుతూ అదే రోజు మరణించింది . మోతె పోచవ్వకు బలమైన గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ 2026 మార్చి 31 న మరణించింది. ఈ ఘటనపై పురాణం సంజీవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు తాగిన మత్తులో అతివేగంగా వాహనాన్ని నడిపి ఇద్దరి మృతికి కారణమైన నర్ర పవన్ ను మంగళవారం ధర్మపురి సిఐ రామ్ నరసింహారెడ్డి అదుపులోకి తీసుకొని రిమాండ్ కి తరలించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా సిఐ రామ్ నర్సింహారెడ్డి మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వలన అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని అతివేగం ,నిర్లక్ష్యపు డ్రైవింగ్ కుటుంబాలను విషాదంలోకి నెట్టేస్తుందని తెలిపారు.ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు .లేనిచో కఠినమైన శిక్షలు తప్పవని ఆదేశించారు.


# 10 నుండి 19 సంవత్సరాల బాలికలకు పౌష్టికాహారం ఎంతో అవసరం

## మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి




**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** 10 నుండి 19 సంవత్సరాల బాలికలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని వీరు క్యారెట్, బీట్రూట్, ఆకుకూరలు, మొలకెత్తిన విత్తనాలు, పండ్లు, గుడ్లు, మాంసాహారం వంటి పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జిందం కళ చక్రపాణి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో కౌమార బాలికలకు హెల్త్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. 10 నుండి 19 సంవత్సరాల వయసు మధ్య గల బాలికలు కౌమార దశలో రక్తహీనత వల్ల చాలా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని దీనివల్ల మానసికంగా శారీరకంగా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. పిల్లలు చిరుతిండ్లకు అలవాటు పడి జంక్ ఫుడ్ తినడం చేత అనారోగ్య సమస్యలు వస్తున్నాయని వీరికి పౌష్టికాహార లోపం ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఇలాంటి క్యాంపుల ద్వారా నైనా ఉచిత పరీక్షలు చేయించుకొని వారి యొక్క ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు. కౌమార దశలో ఉన్న బాలికలు ఈనెల 19వ తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించనున్న హెల్త్ క్యాంపు యొక్క సేవలను వినియోగించుకోవాలని కోరారు. గర్భస్థ క్యాన్సర్ నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న హెచ్ పివి టీకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రజినీ, మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదీర్ పాషా, వైద్యాధికారులు నాయిమ, డాక్టర్ సాహితీ, మాజీ కౌన్సిలర్ బత్తుల వనజ రమేష్, మెప్మా టీఎంసీ మహాలక్ష్మి పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ



**ప్రజాపక్షం/ మల్లాపూర్ :** మండలంలోని రావు పేట గ్రామానికి చెందిన కడకుంట్ల హారిక కు మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి స్థానిక సర్పంచ్ తోట శ్రీనివాస్ మంగళవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. వీరి వెంట ఉప సర్పంచ్ మద్దెల నరసయ్య,వార్డు సభ్యులు సుశీల ,నరసయ్య ,నాయకులు మీనయ్య ,నీలకంఠం విక్రమ్, శ్రీనివాస్,రాజేష్ ,కార్యదర్శి మోహన్, తదితరులున్నారు.

# అత్యవసర సమయంలో రక్తదానం చేసిన యువకుడు



**ప్రజాపక్షం /మెట్పల్లి :** మెట్పల్లి పట్టణంలోని శ్రీ సాయి సంజీవని హాస్పిటల్లో చికిత్స పొందుతున్న సుమలత అనే మహిళకు అత్యవసర చికిత్స నిమిత్తం ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది.దీంతో పేషెంట్ కుటుంబ సభ్యులు రక్తదాతల అనుసంధాన కర్తలు అరేటి పవన్ కుమార్, ఉదయ్ కుమార్లను సంప్రదించారు.ఈ విషయాన్ని మార్గం శివకు తెలియజేయగా,ఆయన వెంటనే స్పందించి బ్లడ్ బ్యాంక్కు వెళ్లి రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు.మార్గం గంగాధర్ కుమారుడైన శివ అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచారు.రక్తదానం చేసిన మార్గం శివను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, డా.త్రిలోక్ కుమార్, రక్తదాతల అనుసంధాన కర్తలు అరేటి పవన్ కుమార్, ఉదయ్ కుమార్, యువజన సంఘాల సభ్యులు,పేషెంట్ బంధువులు, స్నేహితులు అభినందించారు.

# కొండగట్టు అంజన్న ను దర్శించుకున్న జగిత్యాల డిఆర్డీఓ రఘువరన్



**ప్రజాపక్షం/మల్యాల :** జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు ఆంజనేయ స్వామి నీ మంగళవారం జగిత్యాల జిల్లా డిఆర్డీవో రఘువరన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం వేదోక్త ఆశీర్వచనం చేసి శేష వస్త్రం సత్కరించి,లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ సూపరిండెంట్ ఉపాధ్యాయుల చంద్ర శేఖర్,ఇన్స్పెక్టర్ తూము శ్రీనివాస్,సత్యం ఇతర ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# కో-ఆప్షన్ ఎన్నికల్లో పంతం నెగ్గించుకున్న ఎమ్మెల్యే పటేల్

## ఎన్నికైన ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు బిజెపి మద్దతుదారులే



**ప్రజాపక్షం / భైంసా :** భైంసా మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పంతం నెగ్గించుకున్నారు. మొదట్లో జరిగిన మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో బిజెపి కౌన్సిలర్‌ను తప్పుదోవ పట్టించడంతో అప్పట్లో ఎన్నిక రసబాసాగా మారి ఎన్నిక వాయిదా పడగా, మంగళవారం జరిగిన మున్సిపల్ కోఆప్షన్ ఎన్నికల్లో మూడు స్థానాలకు ఎన్నికలు జరగగా మూడు కోఆప్షన్ పదవులు మున్సిపల్ చైర్మెన్ మద్దతుదారులు దక్కించుకున్నారు. దీంతో నాలుగు కోఆప్షన్ స్థానాల్లో మూడు బిజెపి మద్దతుదారులు కైవసం చేసుకున్నారు. ఎన్నిక ప్రారంభం కావడంతో ఆరుగురు బిజెపి కౌన్సిలర్లు ఏడుగురు ఇండిపెండెంట్ కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యుని హోదాలో ఎమ్మెల్యేపవార్ రామారావు పటేల్ ఎన్నికల్లో పాల్గొన్నారు. ఎంఐఎం కౌన్సిలర్లు గైర్హాజరవడంతో కోఆప్షన్ ఎన్నిక ఏకపక్షం అయింది. అనుకున్న స్థానాలు లేకపోయినప్పటికీ ఎంఐఎం పార్టీ కోఆప్షన్ మెంబర్లను దక్కించుకోవడానికి ఎత్తులు వేయడం, పలు ఆరోపణలు చేసినప్పటికీ ఎమ్మెల్యే పటేల్ ముందు ఏలాంటి పాచికలు పారలేదు. మున్సిపల్ చైర్మెన్ దత్తాత్రి నేతృత్వంలో కౌన్సిలర్‌లు హైకోర్టుకు వెళ్ళగా ఎన్నిక జరిగింది.

### ముగ్గురు కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక

మున్సిపల్ కోఆప్షన్ సభ్యులుగా తోట లింగురాం, ముజీబ్ అహ్మద్, అల్లకొండ కవిత ఎన్నికయ్యారు. ఇందులో ఇద్దరు తోట లింగురాం, ముజీబ్ హైమద్ లు గతంలో మున్సిపల్‌వైస్ చైర్మెన్‌లుగా పదవులు చేపట్టిన వారే, అల్లకొండ కవిత గతంలో కౌన్సిలర్‌గా పనిచేశారు. వీరికి నియామక పత్రాలను సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్, ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, మున్సిపల్ చైర్మెన్ తూమొల్ల దత్తాత్రి కమీషనర్ లింగయ్య నియామక పత్రాలను అందజేశారు.

### మున్సిపల్ కార్యాలయం ముందు మిన్నంటిన సంబురాలు

కోఆప్షన్ ఎన్నికల్లో బిజెపి మద్దతుదారులు ముగ్గురు కోఆప్షన్ సభ్యులుగా ఎన్నిక కావడంతో మున్సిపల్ కార్యాలయం ముందు సంబరాలు మిన్నంటాయి. బిజెపి నాయకులు కార్యకర్తలు, మున్సిపల్ వైస్ చైర్మెన్ అభిమానులు, టపాసులు పేల్చి ఆనందాన్ని పంచుకున్నారు. హిందూ ముస్లీం భాయ్, భాయ్ అంటూ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ వారితో కలిసి ఆనందాన్ని పంచుకున్నారు.

### అనవసరపు ఆరోపణలు చేస్తే ఊరుకునేది లేదు, జాబీర్ హైమద్‌ను హెచ్చరించిన మున్సిపల్ చైర్మెన్

తమ నేత ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌పై అనుచిత వాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని మున్సిపల్ చైర్మెన్ తూమొల్ల దత్తాత్రి మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జాబీర్ హైమద్‌ను హెచ్చరించారు. కోఆప్షన్ ఎన్నిక ముగిసిన అనంతరం ఆయన మీడియా తో మాట్లాడారు. మరో మారు ఇలాంటి ఆరోపణలు చేస్తే తగిన రీతిలో సమాధానం చెబుతామన్నారు. గతంలో తప్పుదోవ పట్టించి ఎంఐఎం పార్టీ ఒక కోఆప్షన్ స్థానాన్ని దక్కించుకున్న విషయంలో న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తామన్నారు.

# కల్లుగీత కార్మిక కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ శేఖర్‌గౌడ్‌ను సన్మానించిన ఆలయ కమిటీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మోపాల్ మండలం బోర్గాం గ్రామంలోని సంజీవరెడ్డినగర్ కాలనీలోని శ్రీ లవకుశ ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కల్లు గీత కార్మిక కోఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన శేఖర్‌గౌడ్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సౌమ్యుడు, అందరికి అందుబాటులో ఉండే శేఖర్‌గౌడ్‌కు చైర్మన్ పదవి రావటం ఆయన కష్టఫలమన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, నర్సారెడ్డి, సాయిరెడ్డి, అజీత్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, అజయ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, బాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# సేంద్రియ పద్ధతిలో పంటలు పండించాలి



**ప్రజాపక్షం/బాల్కొండ :** ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని ఏప్రిల్ 30 నుండి మే 26 వరకు నిర్వహిస్తున్నట్లు రుద్రూర్ పరిశోధన స్థానం శాస్త్రవేత్త, డాక్టర్ జి.రాకేష్ తెలిపారు. సేంద్రీయ వ్యవసాయంతో రైతులు పర్యావరణాన్ని కాపాడుతూ నేల ఆరోగ్యాన్ని మెరుగుపర్చి ఆరోగ్యకరమైన ఆహారం ఉత్పత్తి చేయవచ్చని, దీర్ఘకాలంలో ఇది సుస్థిరమైన లాభదాయకమైన వ్యవసాయ విధానం, రైతులు క్రమంగా రసాయనాల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ పద్ధతులను అవలంభించడం ఉత్తమమన్నారు. సాగునీటిని సమర్థవంతంగా వినియోగించడం అత్యంత అవసరం, నీటి వనరులు రోజురోజుకు తగ్గుతున్న నేపథ్యంలో డ్రిప్, స్ప్రింక్లర్ వంటి సూక్ష్మ సాగు పద్ధతులను అవలంభించటంతో నీటిని ఆదా చేయవచ్చన్నారు. భవిష్యత్తు తరాలకు నీటి వనరులను సంరక్షించడంలో సహాయపడుతుందన్నారు.లావణ్య, వినాయక్, సర్పంచ్ భూమేశ్వర్, సూరజ్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ వరమిచ్చింది

## కరెంట్ తీగెలు శాపమైంది

**ప్రజాపక్షం/ఆర్మూర్ :** దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదనే సామెతను నిజం చేస్తున్నారు విద్యుత్ శాఖ అధికారులు. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ప్రభుత్వం వరమిస్తే ఇంటిపైన ఉన్న విద్యుత్ తీగెలు తొలగించకుండా అధికారులు శాపంగా మారారు. మండలంలోని చేపూర్ గ్రామంలో ఓ నిరుపేద కుటుంబం సంవత్సరం నుంచికన్నీటి వ్యథ అనుభవిస్తోంది. స్వంతింటి కలతో వదరాని పొట్లు పడుతోంది ఆ గ్రామానికి చెందిన రాయల లక్ష్మీ కుటుంబం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో తమకు ఇల్లు మంజూరైందని ఆ కుటుంబం ఎంతో సంబరపడ్డారు. వెంటనే లక్షల రూపాయలు అప్పు చేసి ఇంటి నిర్మాణం మొదలుపెట్టారు. కానీ వారి ఆశలపై నీళ్లు చల్లుతూ ఇంటిపైనే విద్యుత్ తీగెలు మృత్యు కుహరంలా నిలిచాయి. ఇల్లు మంజూరైన వెంటనే కరెంట్ తీగెలు తొలగించాలని ఏడీ డీఈ, ఎస్ఈల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్న షిఫ్టింగ్‌కు రూ.81 వేలు డీడీ కట్టాలన్నారని బాధితురాలు రాయల లక్ష్మీ కన్నీటితో చెప్పారు. నిరుపేద కుటుంబానికి రూ. 81 వేలు కట్టే స్తోమత ఉంటే ఆమె ఇందిరమ్మ ఇల్లుకు ఎందుకు ఎదురు చూస్తానన్నారు. ఇప్పుడు ఇంటి నిర్మాణం పూర్తి దశకు చేరుకుంది. ఇంటిపైన విద్యుత్ తీగలుండటంతో స్లాబ్ పనులు చేయలేకపోతున్నామని వాపోయారు. మళ్లీ అధికారులను అడిగితే రూ.81 వేలు కన్జ్యూమర్ అన్న కట్టాలి లేదంటే ప్రభుత్వమన్న పే చేయాలి అప్పుడే ఆ తీగలు తీసేస్తామని అధికారులు ఆమెతో చెప్పరని ఆమె వాపోయారు. అప్పు చేసి ఇల్లు కడుతున్నాం. ప్రభుత్వం సహృదయంతో ఇల్లు ఇస్తే అధికారులు మాత్రం మా బాధను పెడచెవినా పెడుతున్నారని బోరున విలపించారు.

# ఆదివాసి నాయకపోడ్ విద్యార్థుల ప్రతిభ పురస్కారాల సన్మానం

## జిల్లా అదనపు కలెక్టర్ దిలీప్‌కుమార్




**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఆర్మూర్ మున్సిపల్ పట్టణ పరిధిలోని పెర్కిట్ గ్రామ శివారులోని మంగళవారం భీమన్న కళ్యాణ మండపంలో ఆదివాసి నాయకపోడ్ విద్యార్థుల ప్రతిభ పురస్కారాల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. జిల్లా ఆదివాసి నాయకపోడ్ ఉద్యోగుల సేవా సంఘం ఆధ్వర్యంలో జిల్లా ఆదివాసి నాయకపోడ్ సేవా సంఘం సహకారంతో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షులు పుట్ట రాజేశ్వర్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ ఉన్నత చదువులో (ఎంబిబిఎస్, ఫిజియోథెరపీ, ఎల్ ఎల్‌బి) ఉత్తమ ప్రతిభ కనబర్చిన సుమారు 100 మంది విద్యార్థులను మెమోంటోలతో అదనపు కలెక్టర్ దిలీప్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థులను ప్రోత్సహించటానికి ఇలాంటి ప్రతిభ పురస్కారాల కార్యక్రమాన్ని నిర్వహించటం చాలా శుభపరిణామం. ప్రతిభ కనబర్చిన విద్యార్థుల స్వంత ఖర్చులతో నగదు బహుమతులను అందజేశామన్నారు. ఈ ఉత్సవంలో నిర్మల్, మంచిర్యాల్, ఆదిలాబాద్, జగిత్యాల్, కామారెడ్డి జిల్లాల అధ్యక్షులు, ఉద్యోగుల సేవా సంఘం అధ్యక్షులు, సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు నిఘా వ్యవస్థ పటిష్ఠ పరచాలి

## పోలీసు కమిషనర్ పి.సాయి చైతన్య

**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో పాటు నిఘా వ్యవస్థ పటిష్ఠ పరచాలని, ప్రతిస్టేషన్‌లో అమలవుతున్న 5 ఎస్ విధానం అమలు పరిచేలా ఎస్‌హెచ్‌వోలు చూడాలని పోలీసు కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. మంగళవారం నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని టౌన్ 5 పోలీస్ స్టేషన్‌ను నిజామాబాద్ పోలీసు కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న కమిషనర్‌కు పోలీసు అధికారులు, సిబ్బంది గౌరవ వందనం అందించగా, వందనాన్ని స్వీకరించి అనంతరం స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని, సైబర్ క్రైమ్స్ గురించి వివిధ పాఠశాలలు, కళాశాలలో, సోషల్ మీడియా ద్వారా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో గల విలేజ్ పోలీసు ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రజలతో మమేకమై ఆయా ప్రాంతాలలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.శ్రీనివాస్, సిసిఆర్‌బి ఇన్స్‌పెక్టర్ అంజయ్య, టౌన్ 5 ఎస్ఐ ఎం. గంగాధర్, ఎస్ఐ 2 ఆర్.లక్ష్మ య్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఎడపల్లిలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

**ప్రజాపక్షం/ఎడపల్లి:** కేంద్ర ప్రభుత్వం ఇటీవల పెట్రోల్, డీజిల్ ధరలను లీటర్‌కు మూడు రూపాయల చొప్పున పెంచడాన్ని నిరసిస్తూ మంగళవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అఖిల భారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వ నిర్ణయం సామాన్య ప్రజల పైన పెను భారం మోపుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉపాధి లేక పేద ప్రజలు అర్ధాకలితో అలమటిస్తుంటే, ఇంధన ధరల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. గల్ఫ్ యుద్ధం కారణంగా ధరలు పెరిగాయని చెప్పడం సాకు మాత్రమేనని ఈ పెరుగుదల కేవలం అదానీ, అంబానీ వంటి బడా పెట్టుబడిదారులకు మేలు చేయడానికే అని అన్నారు. నక్కపై తాటికాయ పడ్డట్లు తయారైందన్నారు. ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించుకోవాలని, సామాన్యులపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

# ఆకాశాన్ని అంటిన ఎండు మిర్చి ధర

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంలో ఆదివారం సంతలో వచ్చిన ఎండుమిర్చి ధర ఆకాశాన్ని అంటడంతో కొనలేమంటున్న వినియోగదారులు గత ఆదివారం నుంచి ఇప్పటి వరకు మోర్తాడ్ మార్కెట్ కు వస్తున్న ఎండుమిర్చి ధర కిలో 240 రూపాయాల నుంచి 350 రూపాయల వరకు కిలో మిర్చి ధర పలుకుతుంది. దీంతో ప్రజలు ఎండుమిర్చి కొనే పరిస్థితిలో లేమని అంటున్నారు. ఇంత ధర అని మార్కెట్‌లో మిర్చి వ్యాపారస్తులను ప్రజాపక్షం పలకరించి వివరాలు అడుగగా మిర్చికి ఎన్నో రకాల చీడపీడలు వస్తున్నాయని, దీంతో మిర్చి పంట పండించే రైతులు పంటను కాపాడేందుకు ఎన్నో రకాల చీడపీడలు వస్తున్నాయని, దీంతో మిర్చి పంట పండించే రైతులు పంటను కాపాడేందుకు ఎన్నో రకాల పురుగు మందులు వేయాల్సి ఉంటుందని, అయినప్పటికీ కొంత పంట నష్టం వాటిల్లుతుందని, అయినా సరే పంటను దక్కించుకోవాలన్నా రైతులు పంటపై ఎక్కువ పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని, దీంతో మార్కెట్‌కు తీసుకవచ్చే సరికి మేము ఈ రేట్ల చొప్పున అమ్మాల్సి వస్తుందని వ్యాపారస్తులు పేర్కొన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో కిలోమిర్చికి ఎంత పెట్టుబడి పెట్టైనా మిర్చి కొనవలసి వస్తుందని స్థానిక వినియోగదారులు తెలిపారు. ఏదిఏమైనా మార్కెట్లలో ధరలు నియంత్రిస్తే బాగుంటుందని వారు అంటున్నారు.

## పిట్లం మండల వ్యాప్తంగా జనగణన



**ప్రజాపక్షం/పిట్లం:** పిట్లం మండల వ్యాప్తంగా జనగణన ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతుంది. ఈ నేపథ్యంలో స్థానిక తహసీల్దార్ మహేంధర్ మంగళవారం మండలంలోని పోతిరెడ్డిపల్లిలో కొనసాగుతున్న సర్వే తీరును పరిశీలించారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లు పక్కా ప్రణాళికతో ఇల్లిళ్ళు తిరిగి ప్రజల వివరాలు సేకరిస్తున్నారు. ప్రజలు మీ వద్దకు వచ్చే సిబ్బందికి పూర్తి వివరాలు తెలియజేసి సహకరించాలని తహసీల్దార్ సూచించారు. నిర్ణీత గడువులోపు వంద శాతం జనగణన ప్రక్రియ పూర్తిచేస్తామని సిబ్బంది తహసీల్దార్‌తో పేర్కొన్నారు.

## గడువులోగా ధాన్యం కొనుగోళ్ళు పూర్తిచేయాలి



**ప్రజాపక్షం/పిట్లం:** జిల్లా అధికారులు కేటాయించిన గడువులోపే ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని పిట్లం తహసీల్దార్ మహేంధర్ అన్నారు. ఆయన మంగళవారం పిట్లం మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం నిల్వలను, తూకం చేస్తున్న ప్రక్రియను పరిశీలించారు. కేంద్రంలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్ళు జరపాలని అధికారులను తహసీల్దార్ ఆదేశించారు.

## సింగరేణి మనుగడకు సమష్టి కృషి అవసరం

### జిఎం శ్రీనివాస్

**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:** సింగరేణి సంస్థ నిర్దేశిత ఉత్పత్తి, ఉత్పాదకత సాధనకు ఉద్యోగులంతా సమిష్టిగా కృషి చేయాలని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎస్ఆర్పీ3, ఎస్ఆర్పీ1 భూగర్భ గనుల్లో నిర్వహించిన మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాల్లో ఆయన మాట్లాడారు. పోటీ మార్కెట్ పరిస్థితుల్లో నాణ్యమైన బొగ్గు ఉత్పత్తితో పాటు ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత ఏడాది లక్ష్య సాధనలో సంస్థ 74 శాతం మాత్రమే చేరుకుందని, అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు తొలి నెలలో 100 శాతం ఉత్పత్తి సాధించామని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. సమావేశాల్లో ఉత్పత్తి, యంత్రాల వినియోగం, ఆర్థిక పరిస్థితులు, నాణ్యత, భద్రత, సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. బుధవారం ఆర్కే5, ఆర్కేఎన్‌టీ గనుల్లో సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశాల్లో సింగరేణి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆన్‌లైన్ మందుల విక్రయాలు నిలిపివేయాలి

**ప్రజాపక్షం/మందమర్రి :** ఆన్‌లైన్ ద్వారా మందుల విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని మంచిర్యాల జిల్లా కెమిస్ట్రీ అసోసియేషన్ ఈసీ మెంబర్, మందమర్రి మండల అసోసియేషన్ ప్రెసిడెంట్ మచ్చ మల్లేష్ డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ పిలుపు మేరకు మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను మందమర్రిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ సంస్థల భారీ డిస్కౌంట్లను, నకిలీ మందులను అరికట్టాలని, జీఎస్ఆర్ 817, జీఎస్ఆర్ 220 ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. చిన్న కెమిస్టుల జీవనోపాధిని, మెడికల్ షాపులను రక్షించేందుకే ఈ సమ్మె చేపడుతున్నట్లు పేర్కొన్నారు. సమ్మెపై స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ నరేష్, మండలాదాయ అధికారి సతీష్ కుమార్ కు ముందస్తు



సమాచారం ఇచ్చామని, అత్యవసరాలకు సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బీరం రవి, మంద తిరుమల్, కట్ల శ్రీనివాస్, బత్తుల శంకర్, గణేష్, మల్లేష్ పాల్గొన్నారు.

## పశువుల అక్రమ రవాణాను అరికట్టాలి

### సిర్పూర్ మ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు

**ప్రజాపక్షం/కాగజ్ నగర్:** సిర్పూర్ నియోజకవర్గం మీదుగా హైదరాబాద్‌కు సాగుతున్న గోవులు, పశువుల అక్రమ రవాణాను వెంటనే అరికట్టాలని సిర్పూర్ ఎంఎల్ఏ పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున పశువుల రవాణా కొనసాగుతోందని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒక్కో ట్రక్కులో 20 నుంచి 30 మూగజీవాలను కుక్కి తరలిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో బక్రీద్ పండుగ ఉండటంతో ఈ అక్రమ



రవాణా మరింత పెరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, పోలీసు యంత్రాంగం ప్రత్యేక తనిఖీలు నిర్వహించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. గోరక్షదళ్ సభ్యులు అప్రమత్తంగా ఉండి అక్రమ రవాణాను అడ్డుకొని పోలీసులకు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాలయానికి కూడా ఈమెయిల్ పంపినట్లు వివరించారు.

## అక్రమాలకు పాల్పడితే మీసేవ కేంద్రాలపై కఠిన చర్యలు

**ప్రజాపక్షం/చెన్నూరు:** ధనార్జనే ధ్యేయంగా అక్రమాలకు పాల్పడే మీసేవ, ఇంటర్నెట్ కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ డిస్ట్రిక్ట్ మేనేజర్ సునీల్ కుమార్ హెచ్చరించారు. చెన్నూరులోని పలు కేంద్రాలను జిల్లా మేనేజర్ జితేందర్ రెడ్డి, జీపీవో బిక్షపతితో కలిసి మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ కొంతమంది నిర్వాహకులు మీసేవ అప్లికేషన్లు తీసుకుని ప్రజల నుంచి అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. తనిఖీల్లో భాగంగా ఆదర్శనగర్‌లోని సితార ఇంటర్నెట్ సెంటర్‌లో మరో మీసేవ కేంద్రానికి చెందిన రసీదులు లభించాయని తెలిపారు. ఫ్యామిలీ మెంబర్, రెసిడెన్సీ, ఆదాయ ధృవపత్రాల దరఖాస్తుల్లో తప్పుల వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, ధ్రువీకరణ పత్రాల కోసం తప్పనిసరిగా గుర్తింపు పొందిన




మీసేవ కేంద్రాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీసేవ పేరుతో మోసాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి కేంద్రంలో తప్పనిసరిగా మీసేవ బోర్డు, రేట్ చార్ట్, అధికారుల ఫోన్ నంబర్లు, రిజిస్టర్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

## కార్మికుల హక్కులు కాపాడడంలో ఎఐటియుసి, ఐఎన్‌టియుసి విఫలం

**ప్రజాపక్షం/ నస్పూర్:** సింగరేణిలో కార్మికుల హక్కులు కాపాడడంలో ఏఐటియూసి, ఐఎన్‌టియూసి పూర్తిగా విఫలమయ్యాయని సిఐటియూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజిరెడ్డి విమర్శించారు. నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్‌లో ఏరియా కార్యదర్శి కస్తూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గుర్తింపు సంఘం, ప్రాతినిధ్య సంఘాలు కార్మికులను మోసం చేశాయని మండిపడ్డారు. మెడికల్ బోర్డును నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తున్నారని, బోర్డు నిర్వహిస్తే తేదీలను ప్రకటించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యానికి రావాల్సిన 54 వేల కోట్ల రూపాయల బకాయిలను వెంటనే చెల్లించాలని,




12వ పేజీ బోర్డు కమిటీని ప్రకటించాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే కలిసివచ్చే సంఘాలతో కలిసి సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ నాయకులు పెర్క సదా

## మీడియా మిత్రులతో కలెక్టర్ సెల్ఫి



**ప్రజాపక్షం/ మావల:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక పర్యాటక వారోత్సవాల్లో భాగంగా మావల హరితవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ రాజేశ్వర్, పర్యాటక శాఖ అధికారి రవికుమార్, డీపీఆర్ఓ విష్ణువర్ధన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులతో కలిసి ప్రత్యేక వాహనంలో సఫారీ కార్యక్రమం నిర్వహించారు. అటవీ ప్రాంతంలో పర్యటిస్తూ వన్యప్రాణులను వీక్షించిన అనంతరం కలెక్టర్ వారితో కలిసి సెల్ఫీదిగారు.

## ఆదిలాబాద్ పర్యాటక వైభవాన్ని ప్రపంచానికి చాటుదాం



**ప్రజాపక్షం/ మావల:** పర్యాటక వారోత్సవాలలో భాగంగా వినూత్నంగా 'ఇన్‌ఫ్లుయెన్సర్ రీల్స్ కాంపిటీషన్' నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. మంగళవారం మావల పార్క్‌లో నిర్వహించిన ప్రెస్ టూర్‌లో ఆయన పాల్గొని మాట్లాడుతూ జిల్లాలోని ప్రకృతి సంపద, జలపాతాలు, ఆదివాసీ సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేసేందుకు ఈ పోటీని చేపట్టినట్లు చెప్పారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు, కంటెంట్ క్రియేటర్లు జిల్లా అందాలను ప్రతిబింబించేలా 4కే రూపొందించిన వీడియోలను ఈ నెల 21వ తేదీ ఉదయం 11గంటల లోపు విద్యుత్ తరంగిని ఫంక్షన్ హాల్‌లో అందజేయాలన్నారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.5000, ద్వితీయ బహుమతిగా రూ. 4000 తృతీయ బహుమతిగా రూ. 3000 నగదు అందజేస్తామని, వివరాలకు పర్యాటక అధికారి రవికుమార్(9440816087), డీపీఆర్ఓ విష్ణువర్ధన్(91541 70902)లను సంప్రదించాలని కోరారు.

## సివిల్ పోలీసులకు వెన్నెముకగా సాయుధ సిబ్బంది

### ఎస్‌పి అఖిల్ మహాజన్

**ప్రజాపక్షం/ మావల:** శాంతి భద్రతల పరిరక్షణలో సివిల్ పోలీసులకు వెన్నెముకగా ఉంటూ ప్రజారక్షణలో కీలక పాత్ర పోషిస్తున్న సాయుధ సిబ్బంది సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. మంగళవారం సాయుధ సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక దర్బార్‌లో ఆయన మాట్లాడారు. సిబ్బంది చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, పోలీసుల ప్రతిష్ట పెరిగేలా విధులు నిర్వహించాలన్నారు. సిబ్బంది తమ భవిష్యత్తు కోసం టర్మ్, హెల్త్ పాలసీలు తీసుకోవాలని, ఇతరులకు స్యూరిటీ ఇచ్చేటప్పుడు జాగ్రత్త వహించాలని సూచించారు. సిబ్బందికి ఎలాంటి వ్యక్తిగత, శాఖాపరమైన సమస్యలున్నా పోలీస్ అసోసియేషన్ ద్వారా తన దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్‌పి కమతం ఇంద్రవర్ధన్, ఆర్ఐలు వెంకటి, మురళి, చంద్రశేఖర్, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



# సిర్పూర్‌లో తీరని బస్సు నిరీక్షణ





**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :** సిర్పూర్ (టి) మండల కేంద్రంలో బస్ స్టాండ్ నిర్మాణం ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న కలగానే మిగిలిపోతోంది. రెండు దశాబ్దాల క్రితం 2004 లోనే ఈ బస్టాండ్ నిర్మాణానికి ఎంతో అట్టహాసంగా భూమి పూజ, శంకుస్థాపనలు చేసినప్పటికీ నేటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడకపోవడం పట్ల స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిధుల మంజూరు ప్రకటనలు వస్తున్నాయే తప్ప ఆచరణలో మాత్రం పనులు ప్రారంభం కావడం లేదు. ప్రస్తుతం మండల కేంద్రంలో సరైన బస్టాండ్ లేకపోవడంతో వ్యాపార సముదాయాల ముందు, హోటళ్ల ఎదురుగా ప్రధాన రోడ్డుపైనే బస్సులు ఆగుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఎండకు ఎండవలసి, వానకు తడవవలసి వస్తోంది. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు సరైన నీడ, కనీస సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వందలాది మంది ప్రయాణికులు ఈ ప్రాంతం నుండి బెజ్జూర్, చింతల మానేపల్లి, కౌటాల, కాగజ్ నగర్ వంటి ప్రాంతాలకు ప్రయాణిస్తుంటారు. ఇంతటి రద్దీ ఉన్నా అధికారులు గానీ, పాలకులు గానీ పట్టించుకోకపోవడం శోచనీయం.

## సాంకేతిక కారణాల సాకులు

గతంలో బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు, శంకుస్థాపన చేసినట్లు అధికారులు ప్రగల్భాలు పలికారు. కానీ నేటికీ భూమి వివాదం, సాంకేతిక కారణాలంటూ కాలయాపన చేస్తూ సాకులు వెతుకుతున్నారు. ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ నిర్మాణానికి చర్యలు చేపట్టకపోవడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల సమయం రాగానే ఎమ్మెల్యేలు, ఎంపీలు, రాజకీయ నాయకులు వచ్చి బస్ స్టాండ్ నిర్మిస్తామని పెద్దపెద్ద హామీలు గుప్పిస్తున్నారని, గెలిచిన తర్వాత కన్నెత్తి కూడా చూడటం లేదని ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు స్పందించి తక్షణమే బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభించి తమ కష్టాలను తీర్చాలని సిర్పూర్ (టి) మండల ప్రజలు, ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

# ఎమ్మెల్యేను సన్మానించిన కిసాన్‌గల్లి వాసులు



**ప్రజాపక్షం / భైంసా :** భైంసాలోని కిసాన్‌గల్లికి చెందిన అల్లకొండ కవిత సాయినాథ్ కోఆప్షన్ సభ్యునిగా ఎన్నిక కావడంతో కిసాన్‌గల్లి వాసులు కోఆప్షన్ సభ్యునితో వచ్చి ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను శాలువాతో సత్కరించారు. అదే విధంగా మున్సిపల్ చైర్మెన్ తూమొల్ల దత్తాత్రిని సన్మానించారు. ఈ సందర్భంగా పదవి ఇచ్చినందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

# అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం / బోథ్ :** బోథ్ మండలంలోని కౌటబి గ్రామంలో అంబేద్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా కాడి రాజేందర్, ఉపాధ్యక్షులు బిక్క గంగాధర్, కోశాధికారి కామెర శేఖర్, ప్రధానకార్యదర్శి జొన్నల సాయన్న, సంయుక్త కార్యదర్శి రాళ్ళబండి శ్రావణ్ కార్యవర్గ సభ్యులుగా నల్ల హరికాంత్, మాకునూరి రాజు, బిక్క నవీన్, బెక్కం రాజు, పాలెప్ గంగయ్య, పొన్నకంటి జైపాల్, గోలి భూషన్, దలూరి అనిరుధ్ ఎన్నుకోవడం జరిగింది.

# ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ప్రజాపక్షం / నిర్మల్ రూరల్ :** జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో, జిల్లాలో కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాల వారి జిల్లాలో ఇప్పటి వరకు పూర్తి చేసిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని అన్నారు. అందుబాటులో లేని రైతులకు సంబంధించి వివరాలను వివిధ మార్గాల్లో అన్వేషించాలని సూచించారు. రిజిస్ట్రీ ప్రక్రియలో ఏవైనా సాంకేతిక సంబంధమైన ఇబ్బందులు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీ ప్రక్రియ మొత్తం ఎటువంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఇతర అధికారులు, మండల వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎకరానికి 20 క్వింటాళ్ళ జొన్న పంట కొనుగోలు చేయాలని రైతుల ధర్నా



**ప్రజాపక్షం / బోథ్ :** బోథ్ మండల కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో 15 రోజులుగా రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఎకరానికి 20 క్వింటాళ్ళ చొప్పున జొన్నలు కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి విన్నవిస్తున్నారు. రైతులు బి.ఆర్.ఎస్. నాయకులు మంగళవారం ధర్నాలో పాల్గొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌లో లారీల కొరత తీవ్రంగా ఉన్నందున లారీలను అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఎకరానికి 20 క్వింటాళ్ళు కొనాలిని డిమాండు చేశారు. బోథ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గురుస్వామి, ఎస్.ఐ. పురుషోత్తం ఎంపిడిఓ రమేష్ రైతులతో మాట్లాడి ధర్నాను విరమింప చేశారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు మజ్జిగ, ఓఆర్ఎస్ పంపిణీ

**ప్రజాపక్షం/ఎడపల్లి:** ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఉపాధి హామీ కూలీల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఎడపల్లి మండలం జైతాపూర్ గ్రామ సర్పంచ్ రాజు గౌడ్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంగళవారం గ్రామంలో పని చేస్తున్న ఉపాధి కూలీలకు ఆయన స్వయంగా మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద పని చేస్తున్న సుమారు 200మంది కూలీలు డీహైడ్రేషన్ బారిన పడకుండా ప్రతి కూలీకి మజ్జిగతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందచేశారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున కూలీలు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.పని ప్రదేశంలో కూలీల రక్షణ తమ బాధ్యత అని డీహైడ్రేషన్ కాకుండా ఉండేందుకు మజ్జిగ, ఓఆర్ఎస్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కూలీలు పని చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, సమయానుకూలంగా విశ్రాంతి తీసుకోవాలని ఆయన సూచించారు. స్థానిక నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



# ధాన్యం నిల్వకు మరిన్నీ స్థలాలు సమకూర్చుకోవాలి

## జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** జిల్లాలో ధాన్యం నిల్వ చేయుటకు మరిన్ని స్థలాలు సమకూర్చుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యం వెంట వెంటనే గోదాములకు తరలించాలని చెప్పారు. ముందస్తు జాగ్రత్త చర్యగా అదనంగా, ధాన్యం నిల్వ చేయడానికి అవకాశం ఉన్న ప్రదేశాలు సమకూర్చుకోవాలన్నారు. ఇతర జిల్లాల్లో గోదాములు అందుబాటులో ఉంటే, ఆ ప్రదేశాలు గుర్తించి ధాన్యం అక్కడికి తరలించాలని వివరించారు. ధాన్యం నిరంతరాయంగా తరలింపునకు అనుగుణంగా తగినన్ని లారీలు, తగినంత మంది హమాలీలు అందుబాటులో ఉండాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఆర్డీ, రత్నకళ్యాణి, పౌర సరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్, డి.ఎం. మార్క్‌ఫెడ్ మహేష్, డి.ఆర్.డి.ఓ. విజయలక్ష్మి జడ్పిసిఈవో బాగ్యలక్ష్మి డిపిఓ శ్రీనివాస్ ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మండుటెండలో రైతుల మహా ధర్నా !

## రెండు రోజుల్లో జొన్న కొనుగోలు ప్రారంభిస్తాం.. అధికారుల హామీ

**ప్రజాపక్షం / సారంగాపూర్ :** జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు ఒక్కరైతు నుండి కూడా కొనుగోలు చేయలేదని మండల కేంద్రంలోని కర్షకులు కన్నెర్ర చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై మొండుటెండలో మహా ధర్నా నిర్వహించారు. దీంతో గంట పాటు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తూ వరి ధాన్యం కొనుగోలు జరుగుతున్నా లారీలు, గన్నీ సంచుల కొరత తీవ్రంగా ఉండటంతో మార్కెట్ యార్డ్ పూర్తిగా నిండిపోయింది. మార్కెట్ ముందర రోడ్డుపై రాశులుగా పోసి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గత నెల రోజులుగా ఇటు మొక్కజొన్న, జొన్న కొనుగోలు జరపకపోవడంతో రాత్రింబవళ్ళు పస్తులు కాస్తుంటే, మరోవైపు అకాల వర్షాలు బెంబేలెత్తిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్సై శ్రీకాంత్ ధర్నా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడి శాంతిపజేశారు. తహసిల్దార్ విజయకాంత్‌రావుతో మాట్లాడించి జొన్న కొనుగోళ్ళను రెండు రోజుల్లో ప్రారంభిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నాను విరమించారు.



# మాదిగలంటే కాంగ్రెస్ పార్టీకి చిన్నచూపు

## మండల అధ్యక్ష పదవుల్లో మాదిగలకు అన్యాయం

## మాదిగ జాగృతి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్



**ప్రజాపక్షం / బోథ్ :** ఇటీవల తెలంగాణ పిసిసి ప్రకటించిన కాంగ్రెస్ మండల పట్టణ అధ్యక్ష పదవుల్లో ఆదిలాబాద్ జిల్లాలో మాదిగలకు ఒక్కటి కూడా కేటాయించకపోవడం కాంగ్రెస్ పార్టీ మాదిగలను అవమానించడమే అని వెంకటేష్ అన్నారు. రాహుల్ గాంధీ జనగణన, సామాజిక న్యాయం అంటూ మంత్రాలు జపిస్తున్నడే కానీ తన పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం అవేమి పాటించడం లేదని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మాదిగల మీద, దళితుల మీద చిన్న చూపు ఉన్నదని, తరాలుగా మాదిగలు కాంగ్రెస్ పార్టీ జండా మోస్తూ పార్టీకి సేవ చేస్తున్నప్పటికీ పార్టీ మాత్రం మాదిగలను మోసగిస్తూ వస్తుంది. అని అన్నారు. ఇటీవల ప్రకటించిన జన గణనలోనూ మాదిగల జనాభా అత్యధికంగా ఉన్నదని కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పుడు మరీ మండల అధ్యక్ష పదువులు, నామినేటెడ్ పదవుల్లో మాత్రం అన్యాయం చేస్తుంది. అని ఈ విషయం ద్వారా స్పష్టంగా తెలుస్తుంది అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి మాదిగల మీద ఏ మాత్రం గౌరవం, ప్రేమ ఉంటే వెంటనే 50% పార్టీ పదవులు, నామినేటెడ్ పదువులు, మాదిగలకు కేటాయించాలని మాదిగ జాగృతి సంఘం (MJS) పక్షాన డిమాండ్ చేశారు.